సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



తోడుగా.. రక్షగా..


కష్టాల్లో తోడూనీడగా... అనుబంధానికి ప్రతి రూపంగా.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఆప్యాయత పంచుతూ.. తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేదే రక్షాబంధన్. - 8లో



త్వరలోనే ప్రభాస్‌తో స్పిరిట్

ప్రముఖ సినీ హీరో ప్రభాస్‌తో త్వరలోనే స్పిరిట్ సినిమా ప్రారంభమవుతుందని సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి స్పష్టం చేశారు. - 8లో

2.05 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం సాయంత్రం 2,05,864 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10.80 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగు కోసం డెల్టా కాలువలకు 14,100క్యూసెక్కుల నీటిని వదిలారు.

సీజనల్ వణుకే!

- చిన్నపాటి నలతకీ ప్రజల్లో ఆందోళన
- డెంగీ, మలేరియా పరీక్షల కోసం పరుగు
- అధికారుల లెక్కల ప్రకారం ఒక మలేరియా, 21 డెంగీ కేసుల నమోదు
- గ్రామాల్లో క్షీణించిన పారిశుధ్యం
- ఆందోళన వద్దంటున్న వైద్యులు



రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో వైద్యం పొందుతున్న రోగులు

సాక్షి, రాజమహేంద్రవరం: జ్వరమాని వేడెక్కుతోంది. విషజ్వరాలు చాపకింద నీరులా ప్రబలుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా.. ఎవరి గడప తొక్కినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. కొద్దిగా నలత చేసినా డెంగీనా, మలేరియానా అని వణికిపోతున్నారు. ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చూపుతున్న లెక్కలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం ఒక మలేరియా, 21 డెంగీ కేసులు నమోదైనట్లు వారు లెక్కలు చెప్తున్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ వైద్యశాలల్లో నిర్వహిస్తే మాత్రమే కచ్చితమైన ఫలితం అందుతుందని, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్వహించే పరీక్షల్లో నిర్ధారణ అవుతున్న కేసుల్లో పారదర్శకత ఉండదని వైద్యాధికారులు వెల్లడిస్తున్నారు. కాబట్టి ఏ మాత్రం ఒళ్లు వేడెక్కినా ప్రజలు ఆందోళన చెందకుండా అలాగని నిర్లక్ష్యం చేయకుండా వైద్య సహాయం పొందాలని సూచిస్తున్నారు.

సర్వజన ఆస్పత్రి కిటకిట

జ్వరాలతో బాధపడుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజు రోజుకూ రెట్టింపవుతోంది. ప్రతి రోజూ 800 వందలకు పైగా ఓపీ నమోదవుతుంటే అందులో సింహభాగం జ్వరాల కేసులే ఉంటున్నాయంటే తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. ముఖ్యంగా నిడదవోలు, గోపాలపురం, సీతానగరం, కొంతమూరు, శాటిలైట్ సిటీ, కడియం తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా బాధితులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఇవి కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఇదే అదనుగా కొందరు ప్రైవేటు వైద్యులు కాసుల పంట పండించుకుంటున్నారు.

ఎక్కువ ప్రభావం చిన్నారులపైనే

జ్వర పీడితుల్లో సుమారు 60 శాతం ఐదేళ్ల లోపు చిన్నారులే కావడం ఆందోళన కలిగించే విషయం. ఉన్నట్టుండి ఒళ్లు వేడెక్కిపోవడం, నీరసానికి గురవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సహజంగా తల్లిదండ్రులూ ఆందోళన చెందుతున్నారు. జ్వరం ఒక్కోసారి ప్రాణాంతకం కావచ్చని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా అధిక శాతం గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. తాగునీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కలుషితమవుతోంది. కాలం చెల్లిన పైప్‌లైన్లనే ఇప్పటికీ వినియోగించడం, అవి కూడా కొన్ని చోట్ల డ్రైనేజీల్లో ఉండటం నీటి కాలుష్యానికి కారణమవుతోంది. ఇప్పటికీ అనేక పల్లెల్లో బోర్లు, బావుల నీటినే తాగునీటిగా వినియోగిస్తున్నారు. అది కూడా జ్వరాలకు కారణమవుతోంది.

సీజనల్‌పై నామమాత్రంగా ఫోకస్

వర్షాలు కురుస్తుండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. వీటి బారిన పడి అనేక మంది ఆస్పత్రుల పాలై ఆరోగ్యపరంగా, ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది.

నివారణ చర్యలేవీ?

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ, సంబంధిత అధికారులు చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితం అవుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెల్లో బావులు, బోర్లు, కుంటలు, చెరువులు ఉన్న ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు గంబూషియా చేపలను వదలాల్సి ఉన్నా.. ఎక్కడా అటు వంటి దాఖలాలు లేవు.

వైద్యాధికారుల లెక్కలు ఇవీ..

ఆగస్టు నెలలో 1502 మందికి మలేరియా నిర్ధారణకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఒక్కరికి కూడా పాజిటివ్ రాలేదు. 37 మందికి డెంగీ నిర్ధారణకు ఐఎంజీ ఎలీసా టెస్ట్ నిర్వహిస్తే కేవలం ఇద్దరికి మాత్రమే పాజిటివ్ వచ్చింది.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం



విషజ్వరాల వ్యాప్తిపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఫ్రైడే..డ్రైడే నిర్వహిస్తున్నాం. రక్తపరీక్షల సంఖ్య పెంచాం. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం.

– డాక్టర్ సంధ్య, ఇన్‌చార్జి జిల్లా మలేరియా అధికారి

ప్రత్యేక శ్రద్ధ అవసరం



చిన్నారులకు సీజనల్‌గా వచ్చే జ్వరాలపై అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలి. జ్వరం ఉంటే తక్షణ వైద్యంగా పారాసిటమాల్ మాత్రమే వాడాలి. యాంటీబయోటిక్స్ జోలికి వెళ్లవద్దు. ద్రవ పదార్థాలు ఆహారంగా ఇవ్వాలి. కాచి చల్లార్చిన నీటినే తాగించాలి. ప్రతి సంవత్సరం ఫ్లూ టీకాలు వేయించాలి.

– శివరామకృష్ణ, చిన్నపిల్లల వైద్య నిపుణుడు

వైద్యుల భద్రత అందరి బాధ్యత

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు
- కోల్‌కతా విద్యార్థినిపై అఘాయిత్యానికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వైద్యులు, కార్యాలయ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: సమాజానికి వైద్యులు అత్యవసర సేవలందిస్తున్నారని, వారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం భోజన విరామ సమయంలో కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థిని హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆయన ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైద్య విద్యార్థి హత్య ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక మాట్లాడుతూ హత్యకు గురైన వైద్య విద్యార్థిని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ఘటనను వైద్యులుగా తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

కోలకత్తాలో హత్యకు గురైన వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని డీఎంఅండ్‌హెచ్‌వో ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమాలలో ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ షమ్మీ కుమార్, డెమో సత్యకుమార్, వైద్యులు, కార్యాలయ సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఐఆర్‌ఎంఏకు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీలేఖ



తాళ్లపూడి: గుజరాత్ రాష్ట్రంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ (ఐఆర్‌ఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు తాళ్లపూడికి చెందిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ హాజరు కానున్నారు. ఈ నెల 19 సోమవారం నుంచి 23 వరకూ జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముగ్గురు ఎంపికవగా, వారిలో శ్రీలేఖ ఒకరు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ నుంచి తనకు ఉత్తర్వులు అందాయని శ్రీలేఖ శనివారం విలేకరులకు తెలిపారు. తనతో పాటు కర్నూల్ జెడ్పీ చైర్మన్ వై.పాపిరెడ్డి, ప్రత్తిపాడు ఎంపీపీ గొల్లకాంతి సుధాకర్ ఎంపికయ్యారని ఆమె తెలిపారు.

నాన్ మ్యాథమెటిక్స్ విద్యార్థులకు అసోసియేట్ రోల్స్‌గా అవకాశం



ఐ.శారద

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రస్తుత 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ 75 శాతం ఉత్తీర్ణతతో సాధించిన నాన్ మ్యాథమెటిక్స్ గ్రూప్ విద్యార్థులకు అసోసియేట్ రోల్స్‌గా అవకాశం కల్పించనున్నట్టు ప్రాంతీయ రీజినల్ ఇంటర్మీడియట్ విద్యా పర్యవేక్షణ అధికారి ఐ.శారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల్లోని నాన్ మ్యాథమెటిక్స్ గ్రూపు లైన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, వొకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్, టెక్ బీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్, టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని మేనేజ్‌మెంటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వారి కళాశాలల్లోని ఆయా కోర్సుల విద్యార్థులు హెచ్‌టీటీపీఎః://బిట్.ఎల్‌వై/టెక్‌బీ.జీఏ.ఏపీ లింక్ ద్వారా పరీక్షకు హాజరయ్యేటట్టు చూడాలని శారద, జిల్లా ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్‌ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఇతర వివరాలకు శ్రీసాయికిరణ్ 96429 73350ను సంప్రదించాలని తెలియజేశారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

- స్వామిని దర్శించుకున్న 40 వేల మంది భక్తులు
- వ్రతాలు మూడు వేలు
- ఆదాయం రూ.40 లక్షలు



తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న సత్యదేవుడు, అమ్మవారు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయం శ్రావణ శుద్ధ త్రయోదశి, శనివారం సందర్భంగా వేలాది భక్తులతో కిటకిటలాడింది. పెళ్లిబృందాలు, నవ దంపతులు కూడా పెద్ద సంఖ్యలో వచ్చాయి. శుక్రవారం రాత్రి, తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు 50 వివాహాలు జరిగాయి. స్వామివారి ఆలయం, వ్రతమండపాలు, క్యూలై న్లు, విశ్రాంతి మండపాలు, అన్నీ నవదంపతుల తో నిండిపోయాయి. సత్యదేవుని దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీ వల్ల ఉదయం రెండు గంటల పాటు అంతరాలయ దర్శనం నిలిపి వేశారు. వ్రతాల కోసం భక్తులు వ్రత మండపాల వద్ద గంటల తరబడి వేచియుండాల్సి వచ్చింది. కాగా సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు మూడు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో ఐదువేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు స్వామి, అ మ్మవార్లను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం ముందు గ ల ప్రాకారంలోకి తీసుకువచ్చారు. అక్కడ స్వామి, అ మ్మవార్లకు హారతి ఇచ్చారు. తరువాత ఇన్‌చార్జి ఈఓ రమేష్‌బాబు కొబ్బరికాయ కొట్టి ప్రాకార సేవ ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లను మూడు సార్లు ఊరేగించారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

- కలెక్టర్ ప్రశాంతి
- వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సీసీఆర్సీ, సమీకృత కుల ధృవ పత్రాలు జారీ, అర్జీలు పరిష్కారం, స్పెషల్ సమ్మరి రివిజన్–2025 ఓటరు జాబితా పనులు చేపట్టడంపై, సాగులో లేని భూముల క్షేత్ర స్థాయి సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వివిధ శాఖల అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను సోమవారానికి నూరు శాతం పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ 158, ఇతర శాఖలకు సంబంధించి 29 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సత్వరం పరిష్కరించాలని సూచించారు.

ప్రతి నాలుగో శనివారం పౌరహక్కుల సేవా రోజు

మండల స్థాయిలో ప్రతి నెల నాలుగో శనివారం 'పౌర హక్కుల సేవా దినాన్ని' నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఆయా కమిటీ సభ్యులను, పోలీసు అధికారులను, ఇతర సమన్వయ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. రానున్న నెలలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ కమిటి జిల్లా పర్యటన నేపథ్యంలో విజిలెన్స్ కమిటి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అట్రాసిటీ కేసుల పరిష్కారం అయ్యే దిశలో కుల ధ్రువీకరణ పత్రం కోసం 10 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రత్యేక డ్రైవ్ ద్వారా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

28 నుంచి ఇంటింటి సర్వే

స్పెషల్ సమ్మరీ రివిజన్–2025 కి అనుగుణంగా ఈ నెల 28 నుంచి బీఎల్వోలు ఇంటింటి సర్వే చేపట్టి ఓటర్ జాబితాను సవరించాలన్నారు. ఈసీ మార్గదర్శకాల మేరకు ప్రతిపాదనలు పంపాలన్నారు.

సీసీఆర్సీ నమోదు పూర్తి చేయాలి

కౌలు రైతు గుర్తింపు నమోదు పూర్తి చేయాలని, జిల్లాలో ఇప్పటి వరకు 1,04,622 రైతుల వివరాలు నమోదు చేయగా, ఇంకా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 546, కోరుకొండలో 472 , బిక్కవోలులో 427 మంది రైతుల వివరాలు పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, పెండింగ్‌కు కారణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో సాగులోకి రాని సుమారు 15 వేల హెక్టార్ల విస్తీర్ణం ఉందని, క్షేత్రస్థాయిలో ఆ భూములను గుర్తించి నివేదించాలని సూచించారు. సమావేశంలో జేసీ ఎస్.చినరాముడు, డీఆర్వో జి నరసింహులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి పి.పాపారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై దృష్టి పెట్టండి

ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): సైబర్ క్రైమ్, మహిళలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం నిర్వహించిన నెలవారీ క్రైం రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరాలు జరగకుండా అరికట్టేందుకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో క్రైమ్ ప్రోన్ ప్రాంతాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలలో పోలీసుల పట్ల విశ్వాసం, గౌరవం పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పెండింగ్, దర్యాప్తులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి కన్విక్షన్ రేటు పెంచాలని సూచించారు. డే అండ్ నైట్ బీట్లను విస్తరించి, సరైన రీతిలో పెట్రోలింగ్ జరిగేలా చూసుకోవాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే పిల్లల తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, యాంటీ డ్రగ్స్, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలు, నాటు సారా, గంజాయి మొదలైన అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టంకు వచ్చే ఫిర్యాదులపై నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జోనల్ డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రైం సమీక్ష సమావేశంలో సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ నరసింహకిశోర్



క్లుప్తంగా

రైలు కిందపడి ఆత్మహత్య



మృతి చెందిన భానుపద్మేశ్వరరావు

తుని: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ శనివారం తెలపారు. ఆ వివరాల్లోకెళ్తే.. తుని మండలం సూరవరం గ్రామానికి చెందిన వజ్రపు భాను పద్మేశ్వరరావు (19) ఇంట్లో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో చనిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు. స్థానిక రైల్వే పెద్ద గేటు సమీపంలో తుని నుంచి అన్నవరం వైపు వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శృంగార వల్లభునికి రూ.2.69 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకున్న శృంగారవల్లభ స్వామి వారు

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి 2,68,814 రూపాయలు ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 12 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారని, సుమారు నాలుగు వేల మంది భక్తులు అన్నదానం స్వీకరించారని పేర్కొన్నారు.

తోడుగా.. రక్షగా..



- అప్యాయతకు ప్రతీక రక్షాబంధన్
- తోబుట్టువుల అనురాగాలకు సూచిక
- రేపు రాఖీ పండుగ

రాయవరం: కష్టాల్లో తోడునీడగా... అనుబంధానికి ప్రతిరూపంగా.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. ఆప్యాయత పంచుతూ.. తోబుట్టువుల బంధాన్ని శాశ్వతంగా నిలిపేదే రక్షాబంధన్. అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు నిర్వచనమే రాఖీ పండగ. ఇది సోదరి, సోదరుని మధ్యన ప్రేమానుబంధానికి ప్రతీక. ఈ నెల 19వ తేదీ సోమవారం శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి కావడంతో రాఖీ పౌర్ణమిని తోబుట్టువులు ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. పండగ రోజు పుట్టిళ్లు సందడిగా మారనున్నాయి. అక్కాచెల్లెళ్లు కట్టిన రాఖీలతో సోదరుల చేతులు వివిధ రంగులు, డిజైన్ల రాఖీలతో కళకళలాడనున్నాయి. అండగా ఉంటామని హామీ ఇస్తూ అన్నదమ్ములు తమకు తోచిన కానుకలు సోదరీమణులకు ఇస్తారు. రక్షా బంధన్‌ను రాఖీ పౌర్ణమి.. జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తారు. విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకుల మధ్య సోదరభావం, నైతిక విలువలు పెరిగేందుకు ఇది దోహదపడుతోంది. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పెరుగుతున్న పరిస్థితుల్లో కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాలు ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు చొరవ చూపాలి.



ఆకట్టుకుంటున్న రాఖీ

మహాలక్ష్మి స్వరూపంగా..

ఆడ పడుచును మహాలక్ష్మి స్వరూపంగా, పరాశక్తికి ప్రతీకగా భావించే సంస్కృతి మనది. కష్ట సుఖాల్లో భరోసాను అక్కాచెల్లెళ్లకు కల్పించడమే రాఖీ బంధం. సోమవారం జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించుకొనేందుకు సోదర సోదరీమణులు సన్నద్ధమవుతున్నారు. శ్రావణమాసంలో పౌర్ణమి రోజున వచ్చే ఈ పర్వదినాన్ని జంధ్యాల పౌర్ణమిగా పిలుస్తుంటారు. తమిళనాడులో పూనూల్‌పర్వగా, కేరళలో ఆవని ఆవిట్టంగా పిలుస్తుంటారు. ఉత్తరాదిలో రక్షాబంధన్‌గా పిలవడం పరిపాటి. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓంశాంతి) ప్రతినిధులు రాఖీ పండగను ఆధ్యాత్మిక విశిష్టతగలదిగా భావిస్తారు. తమ కార్యాలయాల్లో ఆధ్యాత్మిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రముఖులతో పాటు ఇతర రంగాల ప్రముఖులకు కూడా పండగ రోజు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టడం ఆనవాయితీగా వస్తోంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

మార్కెట్‌లో కళకళ

రాఖీ పండగను పురస్కరించుకుని మార్కెట్‌లోని పలు ఫ్యాన్సీ షాపుల్లో సంప్రదాయ, ఆధునిక రాఖీలు కనువిందు చేస్తున్నాయి. వ్యాపారులు రంగురంగుల రాఖీలను అమ్మకాలకు పెట్టారు. ముఖ్యంగా పిల్లలను ఆకర్షించే వివిధ కామిక్ రాఖీలను ఎక్కువగా విక్రయిస్తున్నారు. మరికొన్ని బంగారు బ్రాస్‌లెట్‌లను తలపిస్తూ ధగధగలాడుతున్నాయి. రుద్రాక్ష, ప్లాస్టిక్, పూల రాఖీలు, రంగు పూసల రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఇవి కాలానుగుణంగా కొత్త డిజైన్లలో వస్తున్నాయి. గతంతో పోల్చితే విక్రయాలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. రూ.10 నుంచి రూ.వేల ధరల్లో లభ్యమవుతున్నాయి.



రామచంద్రపురంలో రాఖీలు కొనుగోలు చేస్తున్న అక్కాచెల్లెళ్లు

ఆన్‌లైన్‌లో కానుకలు

కాలం మారడంతో పాటు రక్షా బంధన్ తీరు మారింది. విద్య, ఉపాధి, ఇతరత్రా కారణాలతో దూర ప్రాంతాల్లో ఉంటున్న సోదరులకు పోస్టు ద్వారా రాఖీలను పంపితే వాటిని కట్టుకొని తోబుట్టువులకు కానుకలు పంపే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరస్పరం అభినందనలు తెలుపుకొంటూ ఆనందాన్ని పంచుకుంటున్నారు. పద్ధతులు మారినా రాఖీ అనుబంధం, ఆప్యాయత మాత్రం చెక్కు చెదరలేదు.

అన్నంటే ప్రాణం



నాకు సొంత అన్నయ్యలు లేరు. నా కజిన్స్ అంతకంటే ఎక్కువగా భావిస్తాను. ఏటా మా అన్నకు రాఖీ కడతాను. ఎంత దూరాన ఉన్నా మా అన్న నా దగ్గరకు వచ్చి రాఖీ కట్టించుకొని వెళ్తాడు. అన్ని పండగల్లో అన్నాచెల్లెల గురించి తెలియజేసే పండగ ఇదే. ఎంత వయసు వచ్చినా అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ఏదీ సాటిరాదు.

–ఆర్.కృష్ణమాధురి,
మండల లెవిల్ అకౌంటెంట్, విద్యాశాఖ
కార్యాలయం, మండపేట

కష్ట సుఖాల్లో తోడుండేవాడే..



కష్ట సుఖాల్లో తోడుగా నిలిచి, మన శ్రేయస్సు కోరుకునే వారే సోదరులు. నా అన్నయ్యలు ఎప్పుడూ నాకు వెన్నంటే నిలిచారు. రాఖీ పండగ వస్తుందంటే నా కంటే ఎక్కువగా అన్నయ్యలు సంతోషపడతారు. ఎంతదూరాన ఉన్నా రాఖీ పండగకు తప్పనిసరిగా ఇంటికి వచ్చి ఆశీర్వదించి వెళ్తారు. వారి ప్రేమాభిమానాలు ఎప్పటికీ నిలిచి ఉండాలని కోరుకుంటాను.

–షేక్ కరీమున్నీసా బేగం,
పసలపూడి,
రాయవరం మండలం

గోవిందా.. హరి గోవింద



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

- వాడపల్లికి ఆధ్యాత్మిక శోభ
- పెరిగిన భక్తుల రద్దీ



ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: గోవిందా.. హరి గోవింద నామస్మరణ మార్మోగింది. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం కిక్కిరిసింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వేద పండితులు, అర్చకులు పువ్వుల రాయుడు వేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు తలనీలాలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు స్వామివారి దర్శనానికి కాలినడకన వచ్చారు. ఆలయ ఆవరణలో వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం, ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మందపల్లిలో శని త్రయోదశి పూజలు



మందపల్లి శనైశ్చరాలయంలో భక్తుల పూజలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) స్వామి వారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామికి ప్రీతికరమైన శనివారంతో పాటు త్రయోదశి పర్వదినం కలసి రావడంతో ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయం వెనుక షెడ్లలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలు, దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ.13,89,710, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.57,700 ఆదాయం వచ్చిందని ఈఓ విజయలక్ష్మి తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దంపతులు మందపల్లి శనైశ్చరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకం చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం కలెక్టర్ దంపతులకు దేవస్థానం తరపున స్వాగతం పలికారు. పూజాధికాల అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందించి, శాలువాతో సత్కరించారు. స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ వై.రాంబాబు, ఆర్ఐ కె.ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

త్వరలోనే ప్రభాస్‌తో స్పిరిట్



మాట్లాడుతున్న సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి

రాజానగరం: ప్రముఖ సినీ హీరో ప్రభాస్‌తో త్వరలోనే స్పిరిట్ సినిమా ప్రారంభమవుతుందని సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి స్పష్టం చేశారు. అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ చిత్రాలు తీసి హిట్ కొట్టి ఫామ్‌లో ఉన్న ఆయన స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్వతంత్ర్య ఆసుపత్రి 38వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో 'సాక్షి' ముచ్చటించింది. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న: మీరు తీసే సినిమాల్లో వైద్యానికి సంబంధించి అంశాలే ఎక్కువగా ఉంటున్నాయి. దానికి కారణాలేంటి?

సందీప్‌రెడ్డి: ఫిజియోథెరపీ కోర్సు చేసిన నేను కొంతకాలం ప్రాక్టీస్ కూడా చేశాను. అందువల్ల ఆ ఛాయలు సినిమాల్లో కాస్త డీప్‌గా కనిపిస్తుంటాయి.

ప్రశ్న: వైద్య రంగంలో ఉన్న మీరు సినిమా రంగం వైపు ఎందుకు వెళ్లారు?

సందీప్‌రెడ్డి: విద్యార్థి దశ నుంచి ఎందుకో సినిమాలపై ఎక్కువగా ఆసక్తి ఉండేది. సినిమా తీసే విధానాన్ని నిశితంగా పరిశీలించే వాడిని. అందుకే ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీసు చేసే సమయంలోనే సినీ రంగం వైపు అడుగులు పడ్డాయి.

ప్రశ్న: తదుపరి సినిమాల గురించి చెబుతారా..!

సందీప్‌రెడ్డి: ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' సినిమా షూటింగ్ త్వరలోనే ప్రారంభమవుతుంది.

ప్రశ్న: మహేష్‌బాబుతో సినిమా అన్నారు, ఎప్పుడు చేస్తారు?

సందీప్‌రెడ్డి: ప్రస్తుతం అందుకు సమయం లేదు. స్పిరిట్ సినిమా తరువాత యానిమల్– 2కి వెళ్తాం. ఈ రెండింటికీ కనీసం నాలుగేళ్లు పడుతుంది. ఆ తరువాతే ఏదైనా ఉంటుంది.

ప్రశ్న: వైద్య విద్యార్థులకు మీరిచ్చే సందేశం ఏంటి?

సందీప్‌రెడ్డి: సినిమాల ద్వారానే నా సందేశం ఏంటో చెబుతూనే ఉన్నాను. ఏదేమైనా చేసే పనిపై ఫోకస్ పెట్టాలి. అప్పుడే సరైన ఫలితాలను అందుకోగలుగుతాం.

సాధారణ బదిలీలకు పచ్చజెండా

- ప్రభుత్వ జీవో విడుదల
- 15 శాఖలలో బదిలీలకు చర్యలు

రాయవరం: ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. బదిలీల షెడ్యూల్, మార్గదర్శకాలతో జీఓ 75ను విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ఈ బదిలీలు జరగనున్నాయి. అయితే బదిలీలను కేవలం 15 శాఖలకే పరిమితం చేశారు. రెవెన్యూ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఇన్‌క్లూడింగ్ సెర్ప్), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జీవీడబ్ల్యూవీ అండ్ వీఎస్‌డబ్ల్యూఎస్, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, ఇంజినీరింగ్ స్టాఫ్ ఇన్ ఆల్ డిపార్ట్‌మెంట్స్, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్, కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖల్లో బదిలీలు జరగనున్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా బదిలీ ఉంటుంది. మిగిలిన వారు జీరో సర్వీస్‌పై రిక్వెస్ట్ బదిలీకి అర్హులవుతారు.

ఉద్యోగ సంఘాల నేతలకు మాత్రం బదిలీ ఒకే స్థానంలో తొమ్మిదేళ్ల వరకూ మినహాయింపు ఉంటుంది. ఈ నెల 19 నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేశారు. తిరిగి సెప్టెంబర్ 1వ తేదీ నుంచి బదిలీలపై నిషేధం కొనసాగుతుంది. కాగా ఉపాధ్యాయులు మాత్రం ఈ బదిలీ ఉత్తర్వుల పరిధిలోకి రారు. ఇదిలా ఉంటే ఎన్నికలకు ముందు ఎన్నికల నిబంధనల్లో భాగంగా రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు బదిలీలకు నోచుకోగా, ఇటీవలే వారిని తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే.

డివైడర్‌ను దాటి.. ముగ్గురిని ఢీకొట్టి

- బైక్‌లను ఢీకొన్న వ్యాన్
- ఒకరికి తీవ్ర గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



చొప్పెల్లలో జాతీయ రహదారి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యాన్

ఆలమూరు: ఓ వ్యాన్ డివైడర్‌ను దాటొచ్చి రెండు బైక్‌లను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద శనివారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చొప్పెల్లకు చెందిన ఆకులు వెంకన్న (45), అడబాల సత్యనారాయణ (57)లు ఓ బైక్ వస్తుండగా, చిక్కిరెడ్డి రాజు (32) మరో బైక్‌పై ఆగి ఉన్నారు. వీరు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వైపు ఇటుక లోడుతో వెళ్తున్న వ్యాన్ ఇక్కడి కొండలమ్మ గుడి జంక్షన్‌కు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్ దాటుకుంటూ వచ్చి వీరి బైక్‌లను ఢీకొంది. అనంతరం మరో వాహనం దగ్గరకు వచ్చి ఆగింది. ఈ ప్రమాదంలో పై ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఎం.అశోక్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వెంటనే హైవే, 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లూ నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిలో సత్యనారాయణ, వెంకన్న పరిస్థితి విషమంగా ఉందనే అభిప్రాయాన్ని వైద్యులు వ్యక్తం చేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మరో క్షతగాత్రుడు చిక్కిరెడ్డి రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు ఆలమూరు ఎస్సై ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం

- హత్యచేశారని పోలీసుల అనుమానం

ఏలేశ్వరం: మండలంలోని మర్రివీడు గ్రామంలో ఏలేరు ప్రాజెక్టుకు వెళ్లే ప్రధాన కాలువలో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి కాళ్లు, చేతులు, తల లేవు. దుండగులు హత్య చేసి కాలువలో పడేసి ఉంటారని భావిస్తున్నారు. ఉదయం కాలువ పక్కనుంచి వెళుతున్న మత్స్యకారులు నీటిలో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతురాలి వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని, హత్య జరిగి వారం రోజులు అయ్యి ఉంటుందని భావిస్తున్నారు. మొండెం మాత్రమే లభ్యం కావడంతో కాలువ ఎగువ ప్రాంతాలైన అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల నుంచి కొట్టుకువచ్చిందా లేదా మైదాన ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఇక్కడ పడేశారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వృద్ధుడి మృతి



కోట వెంకట్రావు (ఫైల్)

కాజులూరు: గొల్లపాలెంలోని కాజులూరు రోడ్ జంక్షన్‌లో శనివారం హెరిటేజ్ పాల వ్యాన్ సైకిల్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్యావటం శివారు ముత్తావారి గరువుకు చెందిన కోట వెంకట్రావు (70) ఐస్‌క్రీమ్ వ్యాపారం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. శనివారం ఉదయం తన సైకిల్‌పై గొల్లపాలెం నుంచి ఇంటికి వెళ్తుండగా కాజులూరు రోడ్ జంక్షన్‌లో ఎదురుగా వస్తున్న హెరిటేజ్ పాల వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో వెంకట్రావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకట్రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ కేసును గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



నరేంద్ర మృతదేహం

కె.గంగవరం: కోటిపల్లిలోని గౌతమి గోదావరి నదిలో శుక్రవారం సాయంత్రం స్నానానికి దిగి కుందూల నరేంద్ర (25) గల్లంతయ్యాడు. రాత్రి నుంచి గజ ఈతగాళ్లతో స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గాలింపు చర్యలు చేట్టారు. స్నానానికి దిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలో శనివారం ఉదయం శవమై తేలాడు. వెంటనే గుర్తించిన ఈతగాళ్లు మృతదేహాన్ని గట్టుకు చేర్చారు. కె.గంగవరం పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే నరేంద్ర మృతితో ద్రాక్షారామ తోటపేటలో విషాదచాయలు అలముకున్నాయి. నరేంద్ర తల్లి ద్రాక్షారామలోని ప్రైవేట్‌గా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది.

ఆర్.ఓ.సి.నెం.08/2024/ఇ1

పురపాలక సంఘ కార్యాలయం
నిడదవోలు, తేది :17.08.2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలో మున్సిపల్ సాధారణ నిధులు మొత్తము రూ.5.00 లక్షల అంచనాల విలువ గల పనిని చేయుటకు 7 రోజుల షార్ట్ టెండరును ఇ-ప్రొక్యూరుమెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించబడినది. వివరములకు http://tender.e-procurement.gov.in దర్శించండి.

1). బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ మొదలు : తేది 17.08.2024 సాయంత్రం గం.06.00ల నుండి
2). బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు : తేది. 24.08.2024 ఉదయం గం.10.30ల వరకు
3). టెండర్లు దాఖలు చేయుటకు ముగింపు : తేది. 24.08.2024 ఉదయం గం.10.45ల వరకు
4). టెండర్లు తెరచుట : తేది. 24.08.2024 ఉదయం గం.11.00ల నుండి

సం/- టి.రామ్ భూపాల్ రెడ్డి
కమీషనర్
నిడదవోలు పురపాలక సంఘము